రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ శివన్నారాయణరెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాటాడుతు మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠినంగ వ్యవహారించాలని పోలీస్, రవాణా శాఖాధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన అరగంటలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత హాస్పిటల్ యాజమాన్యంతో సమన్వయం చేసుకుని క్షతగాత్రులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా వైద్యం అందిచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేతల మధ్య 'పొత్తు' కుదిరేనా..!

- టిడిపి, జనసేన అభ్యర్థుల మధ్య టిక్కెట్ రగడ
- నాకంటే.. నాకంటూ టిక్కెట్‌పై ఎవరి వాదన వారిదే
- ఎవరి ప్రచారం వారిదే అన్నట్లు నియోజకవర్గాల్లో వ్యవహారం
- సీట్ల పంపకం తర్వాత ఇరుపార్టీల పరస్పర సహకారంపై అనుమానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన సీట్ల పంపకంలో నాయకుల మధ్య పొత్తు కుదిరేనా అనే చర్చ సర్వత్రా నడుస్తోంది. టిడిపి, జనసేన నాయకుల మధ్య చోటుచేసుకుంటున్న పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడిగా పోటీ చేయనున్నట్లు అధినాయకులు స్పష్టత ఇచ్చారు. సీట్ల పంపకంపై మాత్రం ఇప్పటికీ సస్పెన్స్ వీడలేదు. దీంతో టిక్కెట్ ఆశిస్తున్న ఇరు పార్టీల నేతల్లోనూ టెన్షన్ నెలకొంది. జనసేనకు జిల్లాలో ఎన్ని సీట్లు కేటాయిస్తారో తెలియని పరిస్థితి ఉంది. బయట జరుగుతున్న ప్రచారం, వ్యక్తిగతంగా టిడిపి, జనసేన నాయకుల చర్చల్లో మాత్రం జనసేనకు జిల్లాలో ఐదు స్థానాలు కేటాయించే అవకాశం ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, కైకలూరు లేక ఏలూరు స్థానాలు కేటాయించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇరుపార్టీల అధ్యక్షుల్లో ఎన్నికల పొత్తుపై స్పష్టతకు వచ్చినప్పటికీ టిక్కెట్ల విషయంలో మాత్రం క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య పొత్తు కుదిరే పరిస్థితి లేకుండా పోయిందనే చర్చ నడుస్తోంది. నరసాపురం టిక్కెట్ జనసేన తరపున బొమ్మిడి నాయకర్‌కు ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఆయన ప్రచారానికి ఏర్పాట్లు సైతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంతలో టిడిపి నాయకులు, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ నాలుగు రోజుల క్రితం మాట్లాడుతూ నరసాపురం టిక్కెట్ ఎవరికీ కేటాయించలేదని, టిడిపి నాయకులు ఆందోళన చెందొద్దంటూ సముదాయించారు. టిడిపి తరపున టిక్కెట్ ఆశిస్తున్న వారిలో మాజీ ఎంఎల్‌ఎ మాధవనాయుడు, కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఉన్నారు. ఒకవేళ బొమ్మిడి నాయకర్‌కు టిక్కెట్ కేటాయించినా టిడిపి నాయకులు సహకరిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. భీమవరంలో జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పోటీ చేయనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇక్కడ టిడిపి నాయకులు తోట సీతారామలక్ష్మి, కోళ్ల నాగేశ్వరరావు మధ్య రాజకీయ వైరం నడుస్తోంది. పవన్‌కల్యాణ్ పోటీ చేస్తే టిడిపి నేతలు సహకరించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉంగుటూరు నియోజకవర్గంలో టిడిపి తరపున గన్ని వీరాంజనేయులు, జనసేన నుంచి పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. ధర్మరాజు ఐదేళ్లుగా జనసేన తరపున పని చేస్తున్నారు. టిక్కెట్ కేటాయింపు తనకే అంటూ గన్ని, కాదు తనకే అంటూ ధర్మరాజు ఎవరి వాదన వారు కార్యకర్తలకు చెబుతున్నారు. పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించే అవకాశం ఉందనే మరో వాదన సైతం వినిపిస్తోంది. టిక్కెట్ ఎవరికి కేటాయించినా వేరే వారు సహకరించే పరిస్థితి ఉందా అంటే అనుమానమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏలూరు విషయానికి వస్తే ఇక్కడ టిడిపి తరపున బడేటి చంటి, జనసేన నుంచి రెడ్డి అప్పలనాయుడు ఉన్నారు. కొత్తగా జనసేన నుంచి తాను పోటీలో ఉన్నట్లు నారా శేషు హడావుడి చేస్తున్నారు. దీంతో టిక్కెట్ కేటాయింపులు పూర్తయిన తర్వాత ఇరుపార్టీల నేతల మధ్య సహకారం ఉంటుందా అనే అనుమానాలు ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో టిడిపి తరపున వలవల బాబ్జి, జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీకి కేటాయించినా మరోపార్టీతో సఖ్యత ఉంటుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. టిక్కెట్ల కేటాయింపులో నెలకొన్న జాప్యం ఇరుపార్టీల నాయకుల మధ్య విబేధాలను మరింత పెంచుతోంది. దీంతో టిక్కెట్ కేటాయించిన తర్వాత నాయకుల మధ్య పొత్తు కుదిరేనా అనే చర్చ పెద్దఎత్తున నడుస్తోంది.

జిల్లా కలెక్టర్‌గా సుమిత్ కుమార్

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా ప్రశాంతి బదిలీ

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పని చేస్తూ మన జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. సుమిత్‌కుమార్ ఐఎఎస్ శిక్షణ అనంతరం 2014లో ఈ జిల్లా పరిధిలోనే నరసాపురం సబ్‌కలెక్టర్‌గా నియమితులు కావడం విశేషం. హర్యానా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతం రోహతక్ జిల్లా కోనూర్ గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన సుమిత్‌కుమార్ ఇంజినీరింగ్ చేసి ఐటి ప్రొఫెషనల్‌గా గురుగావ్‌లో నాలుగేళ్లపాటు పని చేశారు. తర్వాత సివిల్స్ రాసి 2014లో ఐఎఎస్‌కు ఎంపికయ్యారు. అనంతపురం జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా పని చేశారు. 2016 నవంబర్ 26న నరసాపురం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2018 మే 10 వరకూ అక్కడే పని చేశారు. అనంతరం శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. జిల్లాల పునర్విభజన అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా నియమితులై అక్కడ పని చేస్తూ బదిలీపై మన జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు.

సుమిత్‌కుమార్

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా ప్రశాంతి బదిలీ

ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన పి.ప్రశాంతి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో విభజిత పశ్చిమగోదావరి జిల్లాకు నూతన కలెక్టర్‌గా ప్రశాంతి బాధ్యతలు చేపట్టారు. నూతన జిల్లాకు హంగుల కల్పనలో ఆమె ఎనలేని సేవలందించారు.

దామోదరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన శివన్నారాయణ రెడ్డి

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ శివన్నారాయణరెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ బి.శివనారాయణరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో దామోదరం సంజీవయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిఆర్‌ఒ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అందించిన సేవలు అద్భుతమన్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిటిసి టి.ఉమామహేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్ఇ ఎస్.లోకేశ్వరరావు, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, జిల్లా ట్రైబల్ అధికారి డి.పుష్పరాణి, విద్యాశాఖ సహాయ సంచాలకులు కె.సంధ్య, ఎఎస్‌డబ్ల్యూఒలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురంలో..

పాలకొల్లులో..

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

జెఎసి ఆధ్వర్యాన ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసనలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, ఇతర సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ జెఎసి ఆధ్వర్యాన బుధవారం నిరసన తెలిపారు. జెఎసి పాలకొల్లు ఛైర్మన్ గుడాల హరిబాబు నేతృత్వాన తహశీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దార్ బి.సీతారత్నంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హరిబాబు, యుటిఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ వేగేశ్న మురళీకృష్ణంరాజు, వివిధ సంఘాల నేతలు వి.ఉదయ్‌కుమార్, వి.రామ్మోహన్, ఎస్.రాంజీకుమార్, కె.త్రినాధ్, ఐవివి.సత్యనారాయణ, ఆర్.సుధాకర్, కె.రాజశేఖర్, డివి.రమణ, బాలచంద్రుడు, ఎస్‌కె.అమలేశ్వరరావు, హరిబాబు, ప్రసాద్, తారకసత్య, సిహెచ్.ప్రసాద్ పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: ఉద్యోగుల సమస్యలు తక్షణ పరిష్కరించాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.పట్టాభిరామయ్య డిమాండ్ చేశారు. జెఎసి పిలుపు మేరకు బుధవారం లక్ష్మీనరసింహపురంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిహెచ్.పట్టాభిరామయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎవివి.సత్యనారాయణ, ఎన్.సీతాదేవి, జిడబ్ల్యుపి.కుమార్, కె.రాంబాబు, కె.కృష్ణమూర్తి, ఎన్ఎ.నరసింహరాజు, విఎల్ఎన్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

నరసాపురం: సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని జెఎసి అధ్యక్షుడు మామిళ్ల రామసుబ్బారావు అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎపి జెఎసి ఆధ్వర్యాన ఆర్‌డిఒ ఎం.ఎ.అంబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామసుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం.మార్కండేయ, వై.అంజిబాబు, కె.బాలాకుమారి, ఎన్.చంద్రకుమార్, సిహెచ్.కృష్ణమోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు తప్పక వేయించాలి

డిఎంహెచ్‌ఒ ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

చిన్నారులకు రెండు పల్స్ పోలియో చుక్కలు తప్పక వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి.ఉమా మహేశ్వరరావు అన్నారు. నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే లైన్స్ అధికారి డాక్టర్ మౌనిక స్టెఫీ అధ్యక్షతన పల్స్ పోలియోపై జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ పోలియో మహమ్మారి నుంచి పిల్లలను కాపాడుకునేందుకు చిన్నారులకు రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించేలా అంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పక వేయాలని, ఆశాలు, అంగన్వాడీలకు ప్రత్యేక శిక్షణ ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో 1,315 బూత్‌లు, 5,260 మంది అధికారులు, సిబ్బందిని నియమించామని తెలిపారు. ఐదేళ్లలోపు ఉన్న లక్షా 85 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని గుర్తించామన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ డి.సుధాలక్ష్మి, జిల్లా గణాంకాధికారి ఎంఎస్.ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ భావన, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి వెంకటరత్నం, విఎస్ఆర్‌కె.కుమారి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ ఉమా మహేశ్వరరావు

ఎపి నిట్‌ను ప్రగతిపథంలో నిలుపుతా

ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎపి నిట్‌ను సిబ్బంది సహకారంతో ప్రగతిపథంలో నిలిపేందుకు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి తెలిపారు. హైదరాబాద్ ఐఐటి డైరెక్టర్‌గా విధుల్లో ఉన్న ఈయనకు కేంద్రప్రభుత్వం ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నాగపూర్ ఎన్ఐటి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే నిట్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా బిఎస్.మూర్తి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ దేశ ప్రగతిలో విద్యార్థుల భాగస్వామ్యం అత్యంత కీలకమైందన్నారు. ప్రజలకు మేలు చేసే విభిన్న పరిశోధనలు, ప్రాజెక్టులపై దృష్టి సారించాలని తెలిపారు. దేశంలో 31వ నిట్‌గా అవతరించిన ఎపి నిట్‌ను టాప్-10లోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనను అందించేలా చర్యలు తీసుకోవడంతోపాటు వారికి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. తన దృష్టికి తీసుకొచ్చే ఏ సమస్యనైనా పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తానని వివరించారు. డీన్‌లు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించి వారికి పలు సూచనలిచ్చారు. ప్రాంగణంలోని భవన సముదాయాలను పరిశీలించారు. ముందుగా రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి మూర్తికి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎస్.జయరామ్, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.



మూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న దినేష్ శంకర్‌రెడ్డి

శంకుస్థాపన చేస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పసలదీవి గ్రామంలో రూ.54.10 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంక్, పైపులైన్ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక తుపాను రక్షిత భవనంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ లేని విధంగా ఐదు సంవత్సరాల కాలంలో నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాల పనులు వేగంగా చేయడం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తేడా గమనించాలన్నారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసినట్లు తెలిపారు. ఒక్క పసలదీవి గ్రామంలో రూ.13 కోట్లు సంక్షేమం, రూ.17 కోట్లు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. రాజకీయాలు పక్కన పెట్టి నిధులు సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఆచంట

ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో కాంట్రాక్ట్ కార్మికులు ఏళ్ల తరబడి పని చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిఐటియు మండల కార్యదర్శి కోడె శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో మార్టేరు వరి పరిశోధనా స్థానం గేటు ముందు బుధవారం రెండో రోజు కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఫారం మేనేజర్ వీరయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం దిగి రాకపోతే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ నాయకులు డి.నూకరత్నం, కట్టా శ్రీలక్ష్మి, బొంతు నాగలక్ష్మి, లక్ష్మీపార్వతి, వెలగల సావిత్రి, నాగరాజు, జగదీష్ పాల్గొన్నారు.

మళ్లీ కుంగిన ఏటిగట్టు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో రూ.26.32 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పొన్నపల్లి ఏటిగట్టు అభివృద్ధి పనులు పలుసార్లు గోదావరిలోకి కుంగిపోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తాజాగా బుధవారం సాయంత్రం మరోసారి గట్టు గోదావరిలోకి కుంగిపోయింది. ఈ సంవత్సరంలో గట్టు కుంగిపోవడం ఇది మూడోసారి. ఈ నేపథ్యంలో ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ కుంగిన పొన్నపల్లి ఏటిగట్టును పరిశీలించారు. గట్టుపైకి ఎవరూ రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనాలు రాకపోకలు జరగకుండా చూడాలని సూచించారు. కన్జర్వేన్సీ ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని ఇటీవల పరిశీలించి ఎవరూ భయాందోళనకు గురి కావద్దన్నారు.

గోదావరిలోకి కుంగిన గోదావరి ఏటిగట్టు

పేదలకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

ఎన్ఆర్ఐ నూర్మహమ్మద్ ఆర్థిక సహాయంతో ప్రతినెలా నిత్యావసర సరుకులు, మందులు పంపిణీ చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సేవ కార్యక్రమాలు మరెన్నో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పొన్నాల నాగబాబు, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

అధికారులు సమిష్టి కృషి చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - కాళ్ల

తాగు, సాగునీరందించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సమిష్టి కృషి చేయాలని ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అన్నారు. కాళ్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావు మాట్లాడుతూ మండలంలో నూరుశాతం లక్ష్యంగా ఇంటి, కుళాయి పన్నులు వసూలు చేయాలన్నారు. విద్యుత్ శాఖ ఎఇ పి.రాంబాబు మాట్లాడుతూ ఐదు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి గ్రామంలో డిస్ట్రిబ్యూటర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జువ్వలపాలెం, సిసలి, కోలన్నపల్లి గ్రామాల్లో ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. కాళ్ల, మిగతా గ్రామాల్లో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిడిఒ ఎంఎస్ ప్రభాకరరావు, తహశీల్దార్ ఎస్.శ్రీదేవి పాల్గొన్నారు.

నరసాపురం ఎస్ఐ-2గా సత్యనారాయణరాజు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం ఎస్ఐ-2గా ఎం. సత్యనారాయణరాజు బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ గ్రామం సర్పవరానికి చెందిన ఎంఎస్ఎన్.రాజు కాకినాడ, రాజమండ్రి, ముమ్మిడివరం పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా, ఎఎస్ఐగా పనిచేసి పెద్దాపురం ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జెడ్డంగి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి బదిలీపై భీమవరం ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పికి రిపోర్ట్ చేసి నరసాపురం ఎస్ఐ-2గా వచ్చారు. ఆయనకు పలువురు అభినందనలు తెలియజేశారు.

నిజాయితీకి నిలువుటద్దం జగన్

ఆసరా చెక్కుల పంపిణీలో ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేశారని, ఇందులో భాగంగా డ్వాక్రా మహిళలకు 4 విడతలుగా రుణమాఫీ చేసి నీతి నిజాయితీకి నిలువుటద్దంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వైఎస్ఆర్ నాలుగో విడత రుణమాఫీ పంపిణీ కార్యక్రమం బుధవారం స్థానిక త్యాగరాజ భవనంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకొచ్చిన తర్వాత రెండేళ్లపాటు ప్రపంచవ్యాప్తంగా కరోనా తీవ్ర ప్రభావం చూపిందని, దీంతో రాష్ట్ర ఆదాయం గణనీయంగా తగ్గినప్పటికీ ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో అమలు చేశారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు సొంతింటి కలను నెరవేర్చడానికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని తెలిపారు. గృహ నిర్మాణాలకు లక్షా 80 వేల రూపాయాల చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. ప్రజా ప్రభుత్వ పాలన కేవలం జగన్మోహన్ రెడ్డికే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, నర్సాపురం పార్లమెంటు ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైరపర్సన్ బర్రె వెంకటరమణ

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఛైరపర్సన్ బర్రె వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక గాంధీనగర్‌లోని 16, 17వ వార్డులో జరిగిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. శిబిరంలో వార్డు ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కో ఆప్షన్ మెంబెర్ చింతా మాలతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

19 నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నియోజక వర్గ పరిధిలో టెన్నిస్, మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తుమరాడ చిన్న, షేక్ సలాంషేక్ ఖరీం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ శశి కాలేజీ పక్కన వాకర్స్ అసోసియేషన్ ప్రాంగణం ఎంసిజి క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. టీములు నమోదు చేసుకునేందుకు ఈనెల 17వ తేదీ ఆఖరు అని తెలిపారు. 19న టోర్నమెంట్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30,000, రెండో బహుమతిగా రూ.20,000, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ రూ.6,000, బెస్ట్ బ్యాట్స్ మెన్ రూ.3,000, బెస్ట్ బౌలర్ రూ.3,000 వారు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొన దలచినవారు 8712757657, 9949966551, 7997936663 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వృద్ధ దంపతులకు ఎంఎల్ఎ సాయం

ప్రజాశక్తి - ఆచంట

పెనుమంట గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బొడ్డు వెంకటేష్, ముత్యాలమ్మకు 65 సంవత్సరాలు పైబడినా ఆధార్ కార్డులో వయస్సు తక్కువగా పడడంతో పింఛను రావడం లేదు. దీంతో వారు ఎంఎల్ఎ రంగనాథరాజు వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు. ఆయన స్పందించి ఆ దంపతులకు రూ.5 వేలు నగదు అందజేశారు. ప్రతి నెలా తాను రూ.5 వేలు చొప్పున పెన్షన్ ఇస్తానని రంగనాథరాజు భరోసా ఇవ్వడంతో ఆ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

వేంద్ర పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - పాలకోడేరు

వేంద్ర మెయిన్ ప్రాథమిక పాఠశాలను జిల్లా స్థాయి మోడల్ ఫౌండేషన్ సీమేట్ ప్రొఫెసర్ కెఆర్ఎం.ప్రతిష్ట ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ బుధవారం పరిశీలించింది. పాఠశాల తరగతులు, మౌలిక వసతులు, అంగన్వాడీ సెంటర్‌లను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ ఛైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ అందే రామకోటేశ్వరరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సిహెచ్‌ఎస్.సుబ్రహ్మణ్యం, పివిఎస్.నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిఆర్‌పిలు కె.భరణి, ఎస్.అన్నపూర్ణ పాల్గొన్నారు.

అమర జవాన్లకు ఘన నివాళి

ప్రజాశక్తి - పాలకోడేరు

విస్సాకోడేరు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆధ్వర్యంలో జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా ఘటనలో మృతి చెందిన జవాన్లకు బుధవారం ఘన నివాళులర్పించారు. స్థానిక పాఠశాల నుంచి గాంధీ విగ్రహం సెంటర్ వరకూ విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరులైన జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హై స్కూల్ ప్రిన్సిపల్ రిచ్చి మాట్లాడుతూ ఉగ్రదాడిలో 40 మంది భారత జవాన్లు మృతి చందడం బాధాకరమన్నారు. జవాన్ల త్యాగాలు ఎన్నటికీ మరిచిపోలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలను నేరుగా అందిస్తున్నామని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. కలవపూడి గ్రామానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను బుధవారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు స్థలాన్ని చూపించి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 31 లక్షల 75 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు ఒక్క అంగుళం భూమిని కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వంలో ఏమీ చేయలేదు కాబట్టే ప్రస్తుత ప్రభుత్వంపై నిందలు వేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి పెన్మత్స శిరీష విశ్వనాధరాజు, పెన్మత్స దుర్గా ప్రసాదరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నరసింహరాజు

సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి - పోడూరు

ఉద్యోగ, కార్మిక, రైతాంగ, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడే మోజేష్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి బొంతు శ్రీను, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వర్లు విమర్శిచారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త బంద్ సందర్భంగా పోడూరులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం కాకర వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీరో అకౌంట్ ద్వారా రూ.15 లక్షలు వేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. గ్యాస్, పెట్రోలు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారం వేసిందని విమర్శించారు. భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

మొగల్తూరు డిటిగా సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు మండలం డిప్యూటీ తహశీల్దార్‌గా కె.సూర్యనారాయణ రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. పాలకోడేరు మండలం నుంచి మొగల్తూరు మండలానికి డిప్యూటేషన్‌పై వచ్చారు. సూర్యనారాయణ రాజుకు రెవెన్యూ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు. ఇప్పటి వరకూ మొగల్తూరు డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న జి.నరేష్ కుమార్ పాలకోడేరు మండలం డిటిగా డిప్యూటేషన్‌పై వెళ్లారు.

డిటిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యనారాయణ రాజు

నన్నయ యూనివర్శిటీలో ఫ్రెషర్స్ డే

తాడేపల్లిగూడెం: ఆదికవి నన్నయ యూనివర్శిటీ క్యాంపస్‌లోని పీజీ విద్యార్థులు బుధవారం జూనియర్ల కోసం ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.అశోక్ పాల్గొన్నారు. సీనియర్ విద్యార్థులు కొత్తగా చేరిన బ్యాచ్‌కు స్వాగతం పలికి, విద్యార్థి సంఘంలో ఆత్మీయత, స్నేహ భావాన్ని పెంపొందించారు. ఈ ఫ్రెషర్స్ డే పార్టీలో విద్యార్థులు సంగీతం, నృత్యం వివిధ వినోదాత్మక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ టి.అశోక్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడంలో చొరవ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన కోర్స్ కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఛాంబర్స్ విద్యార్థినికి ఎస్ఐ ఉద్యోగం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో 2018-21 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన దొడ్డిపట్లకు చెందిన కొప్పిశెట్టి జ్యోతి సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు, సెక్రటరీ కలిదిండి రామరాజు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు జ్యోతిని సత్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ఛాంబర్స్ కళాశాలలో విద్యాభ్యాస సమయంలో ప్రతిరోజు నిర్వహించే సిఆర్‌టి క్లాసులు, గ్రంథాలయంలో కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు తన విజయానికి దోహదపడ్డాయని చెప్పారు. అధ్యాపకులు ఇచ్చే తర్ఫీదు, ప్రోత్సాహం తన లక్ష్యానికి సహకరించాయన్నారు. కళాశాల ఛైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వోల్గా పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్ పిలుపు

ప్రజాశక్తి - ఆకివీడు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మైక్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరణ చేయడంతోపాటు, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వెంటనే నిలుపుదల చేయాలని పిలుపునిచ్చారు. సమ్మెకు వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు మద్దతు తెలిపి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బివి.వర్మ, గొర్ల రామకృష్ణ, చెన్నం పాపారావు పాల్గొన్నారు.

ఉండి : ప్రజా, కార్మిక, కర్షక రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మెకు ప్రజలందరూ మద్దతు పలికి విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ అన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సిఐటియు నేతలు బుధవారం మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి నేటి వరకూ నిత్యావసర సరుకుల ధరలను, గ్యాస్, పెట్రోల్, డీజిల్, నూనెల ధరలను అదుపు చేయలేకపోయాడని విమర్శించారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా ఈ నెల 16న జరిగే సమ్మెలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు కాళ్ల మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండ సూరిబాబు, మండల సిఐటియు నాయకులు రామకూరి వెంకటరత్నం పాల్గొన్నారు.

పెంటపాడు : ఈ నెల 16న జాతీయ సమ్మె, గ్రామీణ బంద్ పిలుపులో భాగంగా పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సత్తి కోదండరామిరెడ్డి మాట్లాడారు. దేశంలో మోడీ అధికారంలోకొచ్చి పదేళ్ల కాలంలో అన్ని రంగాలూ సంక్షోభంలో ఉన్నాయని తెలిపారు. 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని 13 నెలల పాటు 550 రైతు సంఘాలు ఢిల్లీ సరిహద్దుల్లో పెద్ద ఎత్తున నిరసన తెలిపారన్నారు. ఆ సందర్భంగా మోడీ నల్ల చట్టాలను వెనక్కి తీసుకుంటున్నానని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటిస్తానని విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేస్తానని ఇచ్చిన హామీలు పరిష్కారం కాలేదని తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న రైతు సంఘాలు గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ సమ్మెకు మద్దతు ప్రకటించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పి.దుర్గ, కొల్లి రామకృష్ణ పాల్గొన్నారు

తణుకు రూరల్ : అన్నదాతలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని, రైతులపై దాడులకు పాల్పడడాన్ని ప్రజలందరూ ఖండించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐటియుసి జిల్లా నాయకులు బొద్దాని నాగరాజు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గండి రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద ఈ నెల 16న దేశ వ్యాప్తంగా కార్మికులు, రైతులు ఇచ్చిన ఆందోళనలో భాగంగా కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశం టిఎన్ టియుసి జిల్లా అధ్యక్షులు గండి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతుల పట్ల మోడీ ప్రభుత్వం తీరు దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, సిఐటియు జిల్లా నాయకులు అడ్డగర్ల అజయ కుమారి, ఎన్.ఆదినారాయణ బాబు, గార రంగారావు, వి.రామలింగం, వి.చంటి పాల్గొన్నారు.

విగ్రహం వివాదంపై ఆందోళన విరమణ

ప్రజాశక్తి - పాలకొల్లు

అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలని కోరుతూ పట్టణంలోని 11వ వార్డు ప్రజలు మున్సిపల్ కార్యాలయం వద్ద 7 గంటలపాటు చేసిన ఆందోళన విరమించారు. నరసాపురం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డిఎస్‌పి మనోహర్, కమిషనర్ శేషాద్రి, భజరంగదళ్, వార్డు ప్రతినిధులతో మున్సిపల్ కార్యాలయంలో జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు కూడా ఏకాభిప్రాయం రావడానికి కృషి చేశారు. విగ్రహానికి సోమవారం వరకూ మున్సిపల్ కార్యాలయంలో పూజలు చేసేలా అధికారులు అంగీకరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామని ఆర్‌డిఒ చెప్పారు.

విద్యాసంస్థల్లో అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

వసంత పంచమిని పురస్కరించుకొని పాలకొల్లు లజపతిరాయ్ పేటలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సామూహిక అక్షరాభ్యాసం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 120 మంది చిన్నారులు తల్లిదండ్రులతో పాల్గొని అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిటిడి సభ్యులు మేకా శేషుబాబు మాట్లాడారు. స్కూల్ సెక్రటరీ కెవి.కృష్ణవర్మ, డైరెక్టర్ చిలుకూరి కుమార్, ప్రిన్సిపల్ ఎస్‌పిఎస్.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలోని శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వసంత పంచమిని పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో సరస్వతీ పూజ, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసాపురం అశ్విని హాస్పిటల్ డాక్టర్ పద్మావతి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, స్కూల్ డైరెక్టర్ ఘంటసాల హేమవల్లీ, అకడమిక్ అడ్వయిజర్ బోయి రామచంద్రరెడ్డి పాల్గొన్నారు. అలాగే శ్రీచైతన్య స్కూల్లో అక్షరాభాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడారు.

మొగల్తూరు : చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని మొగల్తూరు కోట సంస్థాన దిశలు, సొసైటీ మాజీ అధ్యక్షులు కలిదిండి గోపాలకృష్ణంరాజు అన్నారు. వసంత పంచమిని పురస్కరించుకుని పాలకొల్లుకు చెందిన మాంటిస్సోరి స్కూల్ ఆధ్వర్యంలో మొగల్తూరులోని వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు పలకా, బలపం పుస్తకాలు అందించి అక్షరాభ్యాసం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ యు.గీతా రాంబాబు, పాఠశాల డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న గోపాలకృష్ణంరాజు

In the Court of the
Honourable Principal Senior
Civil Judge at Anakapalle
E.P. No. 9/2022 in
O.S. No. 379/2018
(On the file of Honourable Ist Additional Senior Civil Judge, Kakinada)
Between:
Bhagavathula Gopala Krishna Murthy ...Decree Holder
AND
Suresetti Lavanya and another ...Judgement Debtors
To:
1st Judgement Debtor:
Surisetti Lavanya, D/o. Appalanaidu, Door No. 1-144/1, Near Krishna Temple, Kalaparru, Pedapadu Mandalam, Bheemavaram J.C.J., West Godavari District.
పై నెంబరు అమలు గ్రంథములో 1వ JDr అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసారుల నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 06-3-2024వ సం॥ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, అనకాపల్లి వారి కోర్టు ఎదుట మీరు స్వయంగా గానీ, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై అమలు గ్రంథము మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
CHANDAKA VEERA KRISHNA
Advocate, Anakapalle
D.SUBRAHMANYAM
Advovate, Bhanugudi Centre
Kakinada, Cell: 9849715132

టిడిపి నేత రాధాకృష్ణ పై కేసు నమోదు

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ఎఆర్‌టి సెంటర్ వైద్యాధికారిపై దుర్భాషలాడి, బెదిరింపులకు దిగిన టిడిపి నాయకుడు, మాజీ వార్డు కౌన్సిలర్ మల్లిన రాధాకృష్ణపై తణుకు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. తణుకులోని రామకృష్ణ టవర్స్‌లో నివసిస్తున్న డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ గతేడాది డిసెంబరు 26వ తేదీన మాజీ మున్సిపల్ ఛైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్ పుట్టినరోజు సందర్భంగా తేతలి పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఛిల్లీస్ రెస్టారెంట్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, మరికొంత మంది పెద్దలతో భోజనం చేస్తుండగా మల్లిన రాధాకృష్ణ కూడా ఆ ఫంక్షన్‌కు వచ్చారు. రావడంతోనే పాత విభేదాల నేపథ్యంలో రాధాకృష్ణ, రామకృష్ణతో వాగ్వివాదానికి దిగారు. గతంలో మీ దగ్గరికి వచ్చినప్పుడు 'నువ్వు నన్ను గెట్ అవుట్ అంటావా' అని, బూతులు తిడుతూ దాడికి ప్రయత్నించాడని, అక్కడున్న కొంత మంది పెద్దలు వారించగా, మూడు నెలలు ఆగు నీ అంతు చూస్తా.. నీ సంగతి తేలుస్తా' అంటూ బెదిరింపులకు తెగబడ్డాడని తెలిపారు. డిసెంబరు 30వ తేదీన వైద్యుడు రామకృష్ణ తణుకురూరల్ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. కోర్టు అనుమతి తీసుకుంటున్నామని, తదుపరి చర్యలు తీసుకుంటామని అప్పటి సిఐ సిహెచ్ ఆంజనేయులు తెలిపారు. అయితే కోర్టు అనుమతులు జనవరి 25వ తేదీన వచ్చాయని రాధాకృష్ణపై కేసు నమోదు చేసి ఫిబ్రవరి 13 తేదీ మంగళవారం నోటీసులు అందజేశామని తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

AUCTION - NOTICE
IN THE HON'BLE SENIOR CIVIL JUDGE COURT :AT NUZVID:
E.P.No : 44 OF 2014 IN L.A.O.P.No : 80 OF 2002

BETWEEN
Meka Amrutha & Others ... D.H.R's / Claimants
AND
Revenue Divisional Officer, Nuzvid.. J.D.R. / Referring officer

The following scheduled properties belongong to The above named J.D.R is been set for public auction on the date 22.03.2024 by 10.30 A.M towards the balance amount to be paid to DHR's. Hence the potential buyers are invited to attend on the said date and buy below movable properties of JDR at Auction in Court premises, located at Nuzvid.

Schedule

1. Bolero Jeep VAN bearing no. AP 16 BN 3546		- Rs.	1,00,000.00/-
2. Window A.C. in Sub-Collector Chamber		- Rs.	10,000.00/-
3. Computers -	10 in number	- Rs.	30,000.00/-
4. Ceiling fans -	10 in number	- Rs.	3,000.00/-
5. Iron safes -	10 in number	- Rs.	10,000.00/-
6. Chairs -	15 in number	- Rs.	10,000.00/-
7. Wooden Tables -	15 in number	- Rs.	3,000.00/-

D.H.R. Value : Rs. 1,66,000.00/-
Ameena Value : Rs. 1,98,600.00/-

SD/- BY THE ORDER OF THE COURT
Forwarded By:
Gangavelli. Rambabu & Murala. Gopinadh, Advocates for DHR's.

సమస్యలు పరిష్కరించాలని రైల్వే ఎజిఎంకు వినతి

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పరిసర ప్రాంతాల వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సౌత్ సెంట్రల్ రైల్వే ఎజిఎం ఆర్.ధనుంజయులుకు బుధవారం వినతిపత్రం అందజేసినట్టు రైల్వే పాసింజర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్బారపు వెంకట్రావు తెలిపారు. జాతీయ రహదారి 165పై శృంగవృక్షం రైల్వే గేటు వద్ద రైలు పట్టాల మధ్య ఉన్న రోడ్డు ఛిద్రమైందని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఎజిఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ ప్రాంతంలో రైలు పట్టా మధ్య రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రైలు పట్టాలను దాటించే క్రమంలో వృద్ధులు, మహిళలు వారి వాహనాలను పట్టాలు దాటించలేక వాటి మధ్య నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయ ఏర్పడుతోందన్నారు. అలాగే నరసాపురం నుంచి వారణాసి, అయోధ్యకు ఈ ప్రాంతం నుంచి రైలు సదుపాయం కల్పించాలని, నరసాపురం - నాగర్‌సోల్, నరసాపురం - హుబ్లీ రైళ్లకు వీరవాసరం హాల్ట్ కల్పించాలని కోరామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోపి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. పట్టణంలోని 10వ వార్డు లక్ష్మీనగర్ కాలనీలో 'జగనన్నతో జనం గోపన్నతో మనం' పాదయాత్రను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ నేతలు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని జగన్ కోరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి కమిషన్ మెంబర్ చెల్లం ఆనంద ప్రకాష్, టిటిడి సభ్యులు మేకా శేషు బాబు, ఎఎంసి ఛైర్మన్ సాలా దేవి నరసయ్య పాల్గొన్నారు.

మహారాజశ్రీ తణుకు Ist అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 524/2023
Between:
వాది: సాలాపు రాజేష్
&
ప్రతివాద్లు: 1. సోబేటి శ్రీను, S/o. ప్రసాద్, డో.నెం. 2-112, రాచపట్నం, కైకలూరు మండలం, ఏలూరు జిల్లా.
2. సోబేటి పుజిత, W/o. శ్రీను, డో.నెం. 2-112, రాచపట్నం, కైకలూరు మండలం, ఏలూరు జిల్లా.
వాది తరపున దాఖలు చేసిన పేపరు ప్రకటన
పై నెంబరు దావాలో ప్రతివాద్లుకు I.A. 1733/2023 రులో రెస్పాండెంట్సు అయిన మీకు దావా సమన్సును, I.A. లో నోటీసులు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు పంపించినన్నూ అవి మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట ది. 23-2-2024వ సం॥ తేదీన ఉదయం 10.30 గం॥ ని॥లకు హాజరు కావలెను. మీరు స్వయంగా గానీ, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
బి.శైలాకుమారి
తణుకు వాది తరపు అడ్వకేటు
13-2-24 తణుకు, సెల్: 99492 99166

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు
ఎం.వి.ఓ.పి నెం. 415/2023
బిట్వీన్:
దాసరి రాములమ్మ & 2 others ...పిటీషనర్స్
మరియు
జితేంద్ర రామ్ & 2 others ...రెస్పాండెంట్స్
టు:
2వ రెస్పాండెంట్:
SBM ట్రాన్స్‌పోర్ట్ అప్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నెంబర్.3, C-బ్లాక్, 10వ ఫ్లోర్, సన్నీవ్యాలీ అపార్ట్మెంట్స్ నెంబర్.351, కొన్నూర్ హై రోడ్, అయ్యన్నవరం, చెన్నై, తమిళనాడు. లారీ ఓనర్ బేరింగ్ నెం. KA 01 AC 9147.
పై నెంబర్ గ్రంథములో మీరు 2వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, ది. 28-02-2024వ తేదీన పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోన వలెను. లేనియెడల సదురు పై నెంబర్ గ్రంథములో మీయొక్క పరోక్షముగా విచారించబడును.
మాగంటి లక్ష్మణ్ కుమార్,
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు సెల్:9885279889

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు
ఎం.వి.ఓ.పి నెం. 415/2023
బిట్వీన్:
దాసరి రాములమ్మ & 2 others ...పిటీషనర్స్
మరియు
జితేంద్ర రామ్ & 2 others ...రెస్పాండెంట్స్
టు:
1వ రెస్పాండెంట్:
జితేంద్ర రామ, తండ్రి: శ్రీ రాంజీ రామ, హిందూ, మగ, వయస్సు 55 సం॥లు, లారీ డ్రైవర్, లారీ డ్రైవర్ బేరింగ్ నెం. KA 01 AC 9147, అడ్రస్: సన్బర్సా గ్రామం, బైరా మండలం, బాలియా జిల్లా, ఉత్తరప్రదేశ్.
పై నెంబర్ గ్రంథములో మీరు 1వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, ది. 28-02-2024వ తేదీన పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోన వలెను. లేనియెడల సదురు పై నెంబర్ గ్రంథములో మీయొక్క పరోక్షముగా విచారించబడును.
మాగంటి లక్ష్మణ్ కుమార్,
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు సెల్:9885279889